నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 19 మే 2024 | KARIMNAGAR

## ఉపాధ్యాయుల సస్పెన్షన్

### ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

కమాన్ చౌరస్తా, మే 18: ప్రభుత్వ పాఠశాలల్లో ఇతరులు నివసిస్తున్నట్టు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాని ఉపాధ్యాయులపై కరీంనగర్ డీఈవో చర్యలకు ఉపక్రమించారు. చిగురుమామిడి మండలం నవాబ్‌పేట్ ప్రాథమిక పాఠశాల, సైదాపూర్ మండలం నల్లోనితండా ప్రాథమిక పాఠశాలలో కొద్ది రోజులుగా ఇతరులు నివసిస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లని కారణంగా నవాబ్‌పేట్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు ఏ మంగ, నల్లోని తండా ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు బీ సునీతను సర్వీస్ నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈవో జానార్దన్ రావు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఆయా మండలాల ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. అలాగే కరీంనగర్ పట్టణ మండంలోని ఫకీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్జీటీ ఎన్ మంజుల అనధికారిక గైర్హాజరైనందున సర్వీస్ నుంచి సస్పెండ్ చేశామని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కరీంనగర్ మండల విద్యాధికారిని వివరణ కోరినట్లు డీఈవో పేర్కొన్నారు.

## మూలవాగును తోడేస్తున్నారు

మామిడిపల్లి ఇసుక రీచ్‌లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- బావులు, బోర్లలో అడుగంటుతున్న భూగర్భజలాలు
- దాదాపు 200 ఎకరాలకు నీరందని దుస్థితి
- ఆగ్రహించిన గ్రామ రైతులు
- తవ్వకాలు అడ్డుకొని ఆందోళన



మూలవాగులో ఆర్ఐ రాజశేఖర్‌తో మాట్లాడుతున్న రైతులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం మామిడిపల్లి మూలవాగులో ఇసుకను రీచ్‌ను ఏర్పాటు చేసింది. ఇసుక అవసరమున్న వారు సర్కారుకు నగదు చెల్లించి వారానికి రెండుసార్లు (మంగళవారం, శనివారం) ఇసుకను తరలించుకునేందుకు పర్మిషన్ ఇచ్చింది. అయితే ఇదే అదనుగా భావించిన కొంత మంది ట్రాక్టర్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టారు. సర్కారు అనుమతిచ్చిన చోట కాకుండా ఇష్టమొచ్చిన ప్రాంతంలో ఇసుకను తవ్వుతున్నారు. దాంతో సమీప వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, బోర్లు వట్టిపోతున్నాయని రైతులు ఆగ్రహించారు. సుమారు 20 మందికిపైగా రైతులు శనివారం మామిడిపల్లి మూలవాగులో ఇసుక రీచ్ తవ్వకాలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకొని అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకోగా, 'ఇలాగేనా ఇసుక తవ్వేది' అంటూ రైతులు నిలదీశారు. ఇష్టమున్నట్లు ఇసుక తోడేస్తుంటే సాగు ఆగమైతున్నదని ధ్వజమెత్తారు. సుమారు 200 ఎకరాలకు నీరందడం లేదని, పంటలు చివరి దశలో ఎండిపోతున్నాయని వాపోయారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలతో వానకాలంలో సమీపంలోని వ్యవసాయభూముల్లోకి వరద వస్తున్నదని, భూములు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇసుక రీచ్‌లో వెంటనే తవ్వకాలు ఆపాలని, మరో చోటుకు తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ ఆందోళన ఆపేది లేదని స్పష్టం చేశారు. చివరకు ఆర్ఐ రాజశేఖర్ జోక్యంతో రైతులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

### మరోచోటుకు తీసుకుపోవాలి



ట్రాక్టరోళ్లు ప్రభుత్వం అనుమతిచ్చిన వద్ద కాకుండా ఇష్టమున్నచోట తవ్వుతున్నరు. వీళ్ల చేయవట్టి మా వ్యవసాయ బావుల్లో చుక్క నీరుంటలేదు. వానకాలంల అయితే వాగును ఆనుకొని ఉన్న మా భూముల్లోకి వరదచ్చి కోతపడుతున్నయి. ఎండల్ల నీళ్లు లేక, వానకాలంలో భూమి దెబ్బతిన చానా నష్టపోతున్నం. అధికారులు మా మీద దయచూపి ఇసుక రీచ్‌ను మరోచోటుకు తీసుకుపోవాలి.

- లోకుర్తి లింబయ్య, రైతు (మామిడిపల్లి)

### ఇష్టమున్నట్టు తవ్వుతున్నరు



మాకు మూలవాగును అనుకొని వ్యవసాయ భూమి ఉంది. ట్రాక్టర్ వాళ్లు ఇష్టం వచ్చిన చోట ఇసుకను తవ్వుతున్నరు. దీంతో ఎండకాలంల మా బాయిల చుక్కనీరుంటలేదు. బోర్లల్ల కూడా నీళ్లు ఎల్లుతలేవు. ఈ ఇసుక రీచ్ చేయవట్టి మా పంటలన్నీ ఎండిపోతున్నయి. గతేడాది వాగు నీళ్లు ఊళ్లెకు కూడా వచ్చినయి. ప్రజలకు కూడా నష్టం కలిగించే ఇసుక రీచ్‌ను అధికారులు తొలగించాలి.

- లోకుర్తి శంకర్, రైతు (మామిడిపల్లి )

## ఆగమవుతున్న రైతులు

## "పత్తాలేని మంత్రులు

- ఆరు నెలుగా ఉమ్మడి జిల్లా ముఖమే చూడని ఇన్‌చార్జి మంత్రి
- కొనుగోళ్లలో ఇబ్బందులపై కనీస సమీక్షలు కరువు
- అకాల వర్షాలతో అన్నదాత అరిగోస
- కేంద్రాల్లో తడుస్తున్న వడ్ల రాశులు
- మరో మూడు రోజులు వానలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు
- కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే మరింత నష్టమే
- అన్నదాతల్లో ఆందోళన



మంథనిలోని ఏఎంసీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలో నుంచి నీటిని పారబోస్తున్న రైతు

**అకాల వర్షాలతో అన్నదాతలు గోస పడుతున్నరు. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యం కండ్ల ముందే తడిసిపోయి.. కొట్టుకుపోతుంటే కాపాడుకోలేక కండ్ల నీళ్లు పెడుతున్నరు. మరో మూడు రోజులు వర్షాలుంటాయని వాతావారణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మరింత ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో భరోసానివ్వాల్సిన ఉమ్మడి జిల్లా మంత్రులు ఇప్పటి వరకు కనీసం కన్నెత్తి చూడలేదు. రైతన్న వద్దకు వచ్చి తామున్నామనే ధైర్యం ఇవ్వలేదు. తడిసిన ధాన్యం కొంటామంటూ అమాత్యులు ప్రకటనలకు మాత్రమే పరిమితం కాగా.. ఇటు అధికారులు చాలా చోట్ల చేతులెత్తేస్తున్నారు. మరోవైపు వడ్లను వెంటనే కొనాలంటూ పలు చోట్ల రైతులు రోడ్డెక్కుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులపై మంత్రులు కనీసం సమీక్షలు కూడా చేయకపోవడం అన్నదాతపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ప్రేమకు అద్దం పడుతున్నది. ఇక ఇన్‌చార్జి మంత్రి ఆరునెలలుగా ఉమ్మడి జిల్లా ముఖమే చూడకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.**

కరీంనగర్ మే 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఓవైపు అకాల వానలు.. మరోవైపు కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం పది రోజుల నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా రోడ్డెక్కుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ప్రాధేయపడుతున్నారు. చాలా చోట్ల నేరుగా ఆందోళనలకు దిగుతూ.. కనిపించిన వారినల్లా వేడుకుంటున్నారు. అయినా, పట్టించుకునే వారు కరువయ్యారు. ఉమ్మడి జిల్లా మంత్రులున్నా క్షేత్రస్థాయిలో భరోసానిచ్చేవారే లేకపోయారు. నిజానికి ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జిల్లా మంత్రులు అందుబాటులో ఉంటూ.. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. కొనుగోళ్లలో ఇటు అధికారులకు, అటు రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించాలి. జిల్లా స్థాయిలోనూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ.. అన్ని విభాగాలు, శాఖలను ఒకే తాటిపైకి తెచ్చి ఇటు కొనుగోళ్లు, అటు ట్రాన్స్‌పోర్టుతోపాటు మిల్లర్లతోనూ ఇబ్బందులు లేకుండా చూడాలి. ఈ బాధ్యత మంత్రులదే అయినా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం నుంచి నేటి వరకు ఏనాడు కూడా ఈ విషయంపై అధికారులతో సమీక్షించిన దాఖలాలు లేవు. మొన్నటి వరకు ఎన్నికలు అనుకుంటే.. ఎన్నికలయ్యాక కూడా అదే పరిస్థితి! ప్రస్తుతం సమీక్షా సమావేశాలు పెట్టడానికి పెద్దగా ఇబ్బందులు ఉండవు. ఒకవేళ ఉన్నా ఎలక్షన్ కమిషన్ నుంచి కూడా అనుమతి తీసుకోవచ్చు. కానీ, ఆ దిశగా మంత్రులు ఎవరూ అడుగులు వేయడం లేదు. పోనీ ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేస్తున్నా.. రైతుల దగ్గరకు వెళ్లి తామున్నామనే భరోసా ఇవ్వడం లేదు. ఇన్‌చార్జి మంత్రి పరిస్థితి అంతే. గతేడాది డిసెంబర్‌లో ఒకసారి మీటింగ్ పెట్టి వెళ్లారంటే.. తిరిగి నేటి వరకు ఇటువైపు ముఖం చూడలేదు. ఆయన కూడా అధికారులతో సమీక్షిస్తూ దిశానిర్దేశం చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా అసలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉన్నది.

### ఆందోళనలో అన్నదాత

మొన్నటి వరకు ఎన్నికల కారణంగా అధికారులు కొనుగోళ్ల ప్రక్రియపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎందుకంటే ఎన్నికల్లో ఎక్కడ లోపం జరిగినా ఇబ్బంది పడాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఎక్కువగా ఫోకస్ పెట్టనట్టు కనిపించింది. ఫలితంగా మార్కెట్‌కు ధాన్యం తెచ్చిన తర్వాత కూడా రైతులు పదిహేను ఇరవై రోజులపాటు కొనుగోళ్లకు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా చోట్ల ధాన్యం కుప్పలు పేరుకుపోయినా పట్టించుకోలేదు. ప్రస్తుతం మూడు రోజులుగా అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నా కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వెంటవెంటనే కాంటా కావడం లేదు. దీంతో చాలాచోట్ల ధాన్యం వర్షానికి తడిసి పోతున్నది. వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్నది. మరో మూడురోజుల పాటు భారీ వర్షాలున్నాయంటూ వాతావరణ శాఖ చెబుతుండగా.. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక.. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కుతూ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయినా, కొనుగోళ్లలో స్పీడ్ పెరగడం లేదు. అంతేకాదు, తడిసిన ప్రతిగింజా కొంటామని చెబుతున్న మంత్రులు, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం ఎందుకు పెడింగ్‌లో ఉంటుందో మాత్రం చెప్పలేకపోతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేదే నిజమైతే.. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టు కొనచ్చు కదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### ఫోకస్ పెడితేనే వేగం

ఇప్పటికైనా అన్నదాతల ఇబ్బందులు, అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని.. వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ వస్తున్నది. కరీంనగర్ జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 2.20 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నారు. ఇంకా దాదాపు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నది. అందులో 25 నుంచి 30 శాతం బయట మార్కెట్‌లో విక్రయాలు జరిగినా మిగిలింది కొనుగోలు చేయాలి. ఈ ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ఉన్నది. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. సిరిసిల్లలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, 2.03 లక్షలు కొనుగోలు చేశారు. పెద్దపల్లి జిల్లాలో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 2.30 లక్షలు కొనుగోలు చేశారు. ఇంకా 0.50 లక్షల టన్నులను కొనుగోలు చేయాల్సి ఉన్నది. జగిత్యాల జిల్లాలో 6.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినా,, అందులో 3.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని లెక్క కట్టారు. ఇప్పటివరకు 2.85 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా.. ఇంకా 98,698 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అంటే, ఏ జిల్లాలో చూసినా వేలాది టన్నుల ధాన్యం కొనాల్సి ఉన్నది. ఇప్పటికైనా మంత్రులు సమీక్షలు నిర్వహించి.. ఇటు అధికారులు, అటు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడంతోపాటు కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన చేయాల్సి ఉన్నది.



శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## జేఎన్టీయూకి మూడు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకుంటున్న రిజిస్ట్రార్ , ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కొడిమ్యాల, మే 18 : మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలకు మూడు సర్టిఫికెట్లు వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు సమక్షంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) సంస్థ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. ఒకటి ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం, రెండోది ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం, మూడోది ఎనర్జీమేనేజ్ మెంట్ సిస్టం సిర్టిఫికెట్లను ప్రధానం చేసినట్లు చెప్పారు. మూడు సర్టిఫికెట్లు 2027వ సంవత్సరం వరకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, రిజిస్ట్రార్ దామోదర్ రెడ్డి తదితరులున్నారు.

## ట్రినిటీ విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఫౌండర్ మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 18: ఎప్‌సెట్-24 ఫలితాలల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల ఫౌండర్ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, కళాశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రైమ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ క్రమంలో కళాశాలకు చెందిన జే హానికర్ అత్యుత్తమంగా 44వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అలాగే పీ ప్రణయ్ 773, వీ ఆశ్లేష 1254, వీ శ్రీతేజ 1255, వై అశ్విత 1551, సీహెచ్ విగ్నేష్ 1624, అయేషా మహజబీన్ 1627, ఫిల్జా అతీక్ 1748, ఎస్ శ్రీలక్ష్మి 2159, ఎం హర్షవర్ధన్ 2280, ఎన్ గంగశ్రీ 2372, పీ శ్రీదీప 2682, సీహెచ్ రంజిత 2815, మదిహా ఫాతిమా 2913, ఎం ఆశిష్ 2954, కే రాణి 2998, వీ నాగజ్యోతి 3059, ఏ అర్షిత 3266, పీ స్మరణీ 3502, అంశారా సహర్ష్ 3877, అతిఫా షాతిమా 4012, ఎల్ ప్రతిమ 4101 తదితరులు ఉత్తమర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ విద్యా విధానం, విద్యార్థులతో పట్టుదలతోనే ఈ ర్యాంకులు సాధ్యమైనట్టు చెప్పారు.



## ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం

విద్యార్థులతో కలిసి విజయచిహ్నం చూపుతున్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 18: ఎప్‌సెట్ -24 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు జయకేతనం ఎగరేశారు. రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభచూపి ఘనవిజయం సాధించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి టైనిటాన్స్ క్యాంపస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కళాశాలకు చెందిన వీ హాసిని 114, ఎస్ హేమంత్ 157, జీ శ్రీహాస్ 166, కే సుప్రియ 296, ఎస్ జ్ఞానద 480, వీ శ్రీముఖి 568, ఎం వర్షిత్ 575, జీ సాయిమంజునాథ్ రెడ్డి 610, పీ జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీ వెన్నెల 876, తేజస్విని 942, ఏ శివవరుణ్ 973, సీహెచ్ అనూహ్య 950, పీ శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారన్నారు. 16 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకు సాధించడం గొప్పవిషయమన్నారు. అలాగే 39 మంది విద్యార్థులు 2వేల లోపు ర్యాంకులు, 63 మంది విద్యార్థులు 3వేల లోపు ర్యాంకులు, 116 మంది విద్యార్థులు 5వేల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని చెప్పారు. రాబోయే ఐఐటీ అడ్వాన్స్డ, నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ మహోన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి



సమీక్షా సమావేశం అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

కోర్టుచౌరస్తా, మే 18: ఇటీవల కేంద్రం మార్పులు చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కరీంనగర్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అడిషనల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో వెంకటేశ్వర్లు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కలిగించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశంలో కూడా వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసులపై పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం కరీంనగర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరస్వామి నూతన చట్టాల గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, నర్సింగరావు, తుమికి పవన్ కుమార్, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్ రావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మే18: తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ మహిళా అభ్యర్థులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీపార్లర్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఉమెన్స్ టైలర్, ఎంబ్రాయిడరీ కోర్సులు, జూన్1 న బ్యూటీ పార్లర్ మెనేజ్‌మెంట్ కోర్సు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు కోర్సులు నెల రోజుల వ్యవధిలో నేర్పిస్తామన్నారు. నెలపాటు ఉచిత శిక్షణ, వసతి ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వారై, 18నుంచి 45 ఏండ్ల లోపు ఉండి రేషన్‌కార్డు, పదో తరగతి చదివుండాలన్నారు. విద్యార్హత, రేషన్‌కార్డు జిరాక్సు, 5 ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.